# వృంతంకు 'ఫ్రాక్చర్'

శేషు మా పెద్దమ్మాయి. ఆమె పూరా పేరు శేషమాంబ. పొట్టివాళ్ల మధ్య పొడగరి. పొడుగువాళ్ల మధ్య పొట్టి. నవ్విందా అంటే కిలకిలానవ్వి ఇల్లంతా మెఱయిస్తుంది. పలికిందా అంటే ఇంట్లో గంగాళాలు మారు మ్రోగి తీరుతాయి. కూర్చుంటే మూలమూలల కొదిగి కూర్చుంటుంది. పాడేటప్పుడు ఇక ఆ వినయానికి ఆ వినయమే సాటువ.

ఆమె తన భర్త యింటికి వెళ్లిన యీ తరువాత మా యిల్లు సవరించుకోబోతే ఎక్కడ చూచినా ఆమె వ్రాసిన పద్దుకాగితాలే. ఎక్కడ చదివినా ఆమె వ్రాసికొన్న పాటలే.

జలపాతం ముందు మనం నిలబడితే మన రూపం ఆ ఉదకంలో ప్రతి బింబించి తీరుతుంది అనే నమ్మకం పాఠకులకు వున్నట్టాయినా, నా కన్నీళ్లల్లో ఆమె. నేడు ప్రతిఫలిస్తూ వుందని నమ్మండి. కణ్వుడు సన్యాసి కావడంచేతను తన కళ్లు చెమ్మగిల్లి నప్పుడు వెంటనే కావి దుకూలాన్ని అద్దుకుని సమాధాన పడగలిగాడు. నాకు వైరాగ్యం అంటే ఏమిటో సుతరాం తెలియదు. ఆ కారణంచేత రైలుబండి రాజమండ్రి స్టేషన్ విడిచి పెట్టి పట్టాలమ్మటే వెడుతూ కూస్తూవుంటే, నేను నా అరుగు మీద తెలతెలవాఱగట్ల పన్నుండి వింటూ, "తలగడ మీదకు పడ్డ కన్నీళ్లు కళ్లవా, హృదయానివా?" అనే తలపోతను మునిగి పోయాను. కాని ఒక్కొక్క అనుభవము నా ఊహాపథాన్ని ఒక్కొక్క కంకరరాయి. నూతన దార్ఢ్యం అలవడింది. దృష్టి తేరుకుంది. ఈ విధంగా వ్రాయడానికి బలం చేకూరింది.

నేను ఏ యిల్లు అద్దెకు పుచ్చుకొన్నా ఆ యిల్లు అద్దెకు పుచ్చుకున్న యింటిలా భావించక సొంతయిల్లులా తలపోసికొంటూ, ఇంటి ముందో, ఇంటి వెనుకో ఒక చిన్న పూల తోట వేసి పూలు పూయించడం పరిపాటి, ఈ పువ్వుల్ని మొక్కల్ని ఎవళ్లు పాడుచేసి పోతారో ఏ మేకలు తిని పోతాయో అని ఆ తోటకు చుట్టూ కంచె వేసి కాస్తూ వుండేవాణ్ని కూడాను. పువ్వుల యొక్క క్షేమం నిమిత్తం గాను నేను పెద్ద డిసిప్లినేరియన్ను అయిపోక తప్పింది కాదు.

ఇంటిల్లిపాదికీ వుత్తరు వొకటి జారీ చేశాను "ఎవళ్లూ కూడా నే పాతిన తోటలోకి అడుగు పెట్టకూడదని, అందులో పూచే పువ్వులు ముట్టుకోకూడదని." అప్పటికి ఈ ప్రస్తావనలో నా చేత చిత్రింపబడే పిల్ల మిక్కిలీ చిన్న పిల్ల. శైశవంకూడా దాటి వుండదని నాకు జ్ఞాపకం; కాని నడక అబ్బి కుప్పిగంతులు వేస్తూ సాహసం చనువు వచ్చిన చుట్టాలకూ మాకూ కాపరస్తూ వుండేది.

ఒక సాయంకాలం నేను వీథిలోకి వెళ్లి యింటికి తిరిగి వచ్చేలో తల్లినుండి. పెద్ద రిపోర్టు "మతి శేషు తోట కంచె ఎక్కి ముందుకు పడి చేయి విరగొట్టుకుంది. వెంటనే డాక్టరుగారి దగ్గఱకు పంపి బద్దలు వేయింపించి చేతికి మోసం లేకుండా కాపాడాను." అంది.

నేను ఆ విరిగిన చేతిని పరీక్షించకుండానే, వెళ్లి తోట పరిశీలించాను. తోటలో, ఒక పూవుతొడిమ విరిగి మొక్క నుండి వేలు పడ్డట్టు కాపడింది. నా చూపుల్లోని భావం ఆ చిన్ని పిల్ల తెలిసికొందేమో 'ఏది?' అని అడుగుతాననో, నా దగ్గఱకు పరుగెత్తుకుంటూ వచ్చి "డాక్టరుగారితో ఆ పువ్వును విరిగిన తొడిమను కలిపి బద్దల్లో వేసి కట్టివేయమన్నాను. ఆయన చిరునవ్వునవ్వుతూ అసలు నీ చేతికే ఫ్రాక్చర్ లేదు. పువ్వున కెక్కడనుంచి ఫ్రాక్చర్ వస్తుంది? అంటూ పువును తొడిమను ఈ బద్దల మధ్యను పెట్టి బంధించారు." అంది.

ఆమె జవాబుకు నేను మిక్కిలి సిగ్గుపడిపోయినాను. నాటినుండీ తోటకు కంచె తీసివేసి ఎవరికి కావలసిన పువ్వులు వాళ్లు కోసుకోవలసినదిగా కోరినాను.

---

కనుపాప నీడలు ★ రచన: శ్రీ కవికొండల వెంకటరావుగారు